## మంత్రి కేటీఆర్‌ను కలిసిన లక్ష్మణ్‌నాయక్

మహబూబాబాద్ రూరల్, నవంబర్ 2: రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్‌ను గురువారం హైదరాబాద్‌లో సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు బోడ లక్ష్మణ్‌నాయక్, స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. అసెంబ్లీ ఎన్నికల్లో గిరిజన నియోజకవర్గాల్లో ప్రతిఒక్కరూ బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాని మంత్రి వారికి దిశానిర్దేశం చేసినట్లు పేర్కొన్నారు.



మంత్రి కేటీఆర్‌తో లక్ష్మణ్‌నాయక్

## ఎన్నికల వ్యయ పరిశీలన అధికారికి స్వాగతం పలికిన కలెక్టర్



బాబురాయ్‌కు పూల మొక్క అందిస్తున్న కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ డేవిడ్, డీఎస్పీ సత్యరానాయణ

మహబూబాబాద్, నవంబర్ 2: హైదరాబాద్ నుంచి మహబూబాబాద్ కలెక్టర్ కార్యాలయానికి గురువారం వచ్చిన ఎన్నికల వ్యయ పరిశీలన అధికారి ఆర్ బాబురాయ్‌ను ఐడీవోసీలో కలెక్టర్ శశాంక మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ ఎం డేవిడ్, డీఎస్పీ తీర్థాల సత్యనారాయణ ఉన్నారు.

## బీజేపీ నుంచి బీఆర్‌ఎస్‌లోకి చేరికలు

ఇనుగుర్తి, నవంబర్ 2: మండల కేంద్రానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు వల్లముల మహేందర్, ఇసంపల్లి సతీశ్ గురువారం బీఆర్‌ఎస్‌లో చేరారు. కేసముద్రం వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ జాటోత్ హరీశ్‌నాయక్ వారికి కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీలో చేరిన వారికి భవిష్యత్‌లో సముచిత స్థానం కల్పిస్తామనారు. రాబోయేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని, ఎవరూ అధైర్యపడొద్దని నాయకులు, కార్యకర్తలు ఎన్నికల్లో అహర్నిశలు కష్టపడాలన్నారు. బీఆర్‌ఎస్‌లో చేరిన వారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి పార్టీలో చేరామన్నారు. కార్యక్రమంలో మహబూబాబాద్ ఎమ్మెల్యే సతీమణి సీతామహలక్ష్మి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బొబ్బిలి మహేందర్ రెడ్డి, సర్పంచ్, పీఏసీఎస్ చైర్మన్ దీకొండ వెంకన్న, దార్ల రామ్మూర్తి, ఎంపీటీసీ పింగిలి రజితాశ్రీనివాస్, వార్డు సభ్యులు గాడుదుల సరితా రాజన్న, యూత్ నాయకుడు పసునూరి శ్రీకాంత్ పాల్గొన్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న హరీశ్ నాయక్

## విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

కేసముద్రం, నవంబర్ 2: మండలంలోని పెనుగొండ జడ్పీ హైస్కూల్‌లో 32 మంది విద్యార్థులకు రూ.10వేల విలువైన బ్యాగులను లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువారం పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు మాధవ పెద్ది వెంకటరెడ్డి, అనుమాండ్ల వెంకటేశ్వర్లు, పీవీ ప్రసాద్, హెచ్‌ఎం యాదగిరి పాల్గొన్నారు. కేసముద్రం స్టేషన్ పాఠశాల విద్యార్థులకు స్ఫూర్తి ఎడ్యుకేషన్ సేవా సమితి ఆధ్వర్యంలో పుస్తకాలు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజు, స్ఫూర్తి ఎడ్యుకేషన్ సభ్యులు శ్రీధర్‌రెడ్డి, కృష్ణయ్య, వెంకటరెడ్డి ఉపాధ్యాయులు శ్రీనివాస్ మధు, సురేశ్, చందర్ జుబేర్, అలీ పాల్గొన్నారు.




విద్యార్థులకు బ్యాగులు అందిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

# అన్నదాత ఆకలి తీర్చుతున్న 'సద్దిమూట'

- కేసముద్రం మార్కెట్‌లో రైతులకు రూ.5కే మధ్యాహ్న భోజనం
- కార్యక్రమానికి విశేష స్పందన
- ఇప్పటి వరకు 1,08,240 మందికి భోజనం
- రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్న ప్రభుత్వం
- మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సుహాసినీ దుర్గేశ్



రైతులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు

కేసముద్రం, నవంబర్2: ఆరుగాలం కష్టించి పండించిన పంట ఉత్పత్తులను మార్కెట్‌లో అమ్ముకునే సమయంలో అర్ధాకలితో ఉన్న రైతులకు సద్దిమూట కార్యక్రమం మధ్యాహ్నం కడుపు నింపుతున్నది, రైతులు ప్రతి ఏటా జూన్‌లో వేల రూపాయలు పెట్టుబడి పెట్టి పంటలు సాగు చేస్తారు.

వాతావరణ పరిస్థితులు, చీడ పీడల బారీ నుంచి పంటను కాపాడుకొని చేతికి అందివచ్చిన పంటలను అమ్ముకోవడానికి మార్కెట్‌కు తీసుకొస్తుటారు. మార్కెట్‌కు వచ్చిన తర్వాత కాంటాలు పూర్తయ్యే వరకు యార్డులలోనే పడిగాపులు పడాల్సిన పరిస్థితి ఉండేది. ఈ సమయంలో మధ్యాహ్న బోజనానికి డబ్బులు లేక ఎంతో మంది రైతులు పస్తులు ఉంటు, నీరు తాగుతు కడుపు నింపుకునేవారు. మరికొందరు రైతులు ఇంటి వద్ద నుంచి అన్నం తీసుకొచ్చుకొని యార్డులోని దుమ్ము, దూలిలోనే తినేవారు. ఇంకొందరైతే భోటళ్లలో భోజనం చేసేవారు. అయితే రైతులు పంటలను విక్రయించడం ద్వారా మార్కెట్‌కు రూ.కోట్లలో ఆధాయం సమకురుతున్నది. మార్కెట్‌కు వచ్చిన ఆధాయం ద్వారా రైతులకు తాగు నీరు, విశ్రాంతి భవనం, మరుగుదొడ్లు, మూత్రశాలలు, షెడ్లు, గోదాములు, రైతుల సరుకులకు భద్రత, గిట్టుబాటు ధర, భోజన వసతి కల్పించాల్సిన గత పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. కనీస సౌకర్యాలు లేక, మధ్యాహ్న భోజనం లేక రైతులు అర్ధాకలితో ఇబ్బందులు పడేవారు. కానీ సీఎం కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మార్కెట్‌లలో సద్దిమూట ద్వారా కనీస సౌకర్యాలు, మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు.

### 'సద్దిమూట'తో తీరుతున్న ఆకలి

మార్కెట్‌కు పంట ఉత్పత్తుల విక్రయానికి వచ్చిన అన్నదాతల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం సద్దిమూట కార్యక్రమాన్ని 2018లో ప్రారంభించారు. ఇందులో భాగంగా మార్కెట్‌లో రైతులకు తక్కువ ధరకు భోజనం అందించాలనే సంకల్పంతో వరంగల్‌కు చెందిన హరేకృష్ణ, అక్షయపాత్ర అనే 2 స్వచ్ఛంద సంస్థల సహకారంతో రూ.5కే భోజనం అందిస్తున్నారు. కేసముద్రం మార్కెట్‌కు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచే కాకుండా ఖమ్మం, నల్లగొండ జిల్లాల రైతులు తమ పంట ఉత్పత్తులను విక్రయించడానికి సీజన్‌లో రోజుకు 400 నుంచి 500 మంది రైతులు వస్తుంటారు. వీరికి మధ్యాహ్న భోజనం అందించడానికి రవాణా ఖర్చులు కలుపుకొని ఒక్కొక్కరికి రూ.25.25 పైసలు మార్కెటింగ్‌శాఖ నుంచి హరే కృష్ణ, అక్షయ పాత్ర సంస్థకు చెల్లిస్తున్నారు. వరంగల్‌కు చెందిన ఈ సంస్థ వరంగల్ కేంద్రంలో భోజనం తయారు చేసుకొని మధ్యాహ్నం 11 గంటల ప్రాంతంలో వాహనంలో కేసముద్రం మార్కెట్‌కు తీసుకొచ్చి 2గంటల వరకు రైతులకు భోజనం పెడుతారు. ఉదయం మార్కెట్‌కు వచ్చిన రైతులు లాట్ నంబర్ తీసుకునే సమయంలోనే సిబ్బంది మధ్యాహ్న భోజనానికి సంబంధించిన చీటి అందిస్తారు. ఈ చీటి ఆధారంగా రైతులు హరే కృష్ణ సంస్థ ప్రతినిధులకు రూ.5 చెల్లించి భోజనం చేస్తున్నారు. దీంతో రైతులు ఇంటి వద్ద నుంచి అన్నం తీసుకరావడం, బయట హోటళ్లలో డబ్బులు వెచ్చించి భోజనం చేయాల్సిన అవసరం లేకుండా పోయింది. ఈ విధంగా మొత్తం రూ.25.25లో రైతులు రూ.5 చెల్లిస్తుండగా, మార్కెటింగ్ శాఖ రూ.20.25 చెల్లిస్తున్నది. ఈ సద్దిమూట కార్యక్రమం ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటి వరకు 1,08,240 మంది రైతులు మార్కెట్‌లో భోజనం చేశారు. మార్కెట్ నుంచి ఇప్పటి వరకు రూ.21.91 లక్షలను రైతుల భోజనం కోసం ఖర్చు చేశారు.

### మధ్యాహ్న భోజనం బాగుంది



గతంలో మార్కెట్‌కు పంట ఉత్పత్తులను అమ్ముకోవడానికి వచ్చినప్పుడు అన్నం వెంట తీసుకొని వచ్చేది. లేదంటే పస్తులు ఉండేది. ఇప్పుడు మార్కెట్‌లోనే రూ.5కు మధ్యాహ్నం భోజనం అందిస్తుండడంతో ఇంటి వద్ద నుంచి తీసుకురావడం లేదు. రూ.5కే అన్నం, 2 రకాల కూరలు, పచ్చడి, నీరు అందించడం సంతోషంగా ఉన్నది. గత పాలకులు మార్కెట్‌లో రైతులకు సౌకర్యాలు కల్పించలేదు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం రైతుల అభివృద్ధి కోసమే కృషి చేస్తున్నది. పంటలకు నీరు, 24 గంటలు కరెంట్, పెట్టుబడి అందిస్తుండడంతో ఇబ్బందులు లేకుండా సంబురంగా వ్యవసాయం చేస్తున్నాం. *–బానోత్ నర్సమ్మ, రైతు, అప్పరాచ్‌పల్లి*

### రైతులు సద్వినియోగం చేసుకోవాలి



రాష్ట్రంలో ఏ మార్కెట్‌లోనూ లేని విధంగా కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో సద్దిమూట కార్యక్రమం ద్వారా రైతులకు అన్నం పెట్టి వారి ఆకలి తీర్చుతున్నాం. మార్కెట్‌లో మధ్యాహ్నం భోజనం అందిస్తుండడంతో రైతులు సంతృప్తిగా ఉన్నారు. ప్రస్తుతం రూ.5కే భోజనం అందిస్తున్నాం. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. సీఎం కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులకు మధ్యాహ్న భోజనం అందించడంతో పాటు సుమారు రూ.9 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్నది.

*–నీలం సుహాసినీ దుర్గేశ్, మార్కెట్ చైర్‌పర్సన్*

## రాజకీయ లబ్ధి కోసమే పార్టీ మారారు

**బీఆర్‌ఎస్ యూత్ జిల్లా నాయకుడు ప్రవీణ్‌రావు**



సమావేశంలో మాట్లాడుతున్న ప్రవీణ్‌రావు

నెల్లికుదురు, నవంబర్ 2: మండలంలోని మునిగలవీడు గ్రామానికి చెందిన పట్నంశెట్టి నాగరాజు తన రాజకీయ లబ్ధి కోసం పార్టీ మారారని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు నల్లాని ప్రవీణ్‌రావు, గ్రామ శాఖ అధ్యక్షుడు భూక్యా సూర్యప్రకాశ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గ్రామ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పార్టీ మారిన నాగరాజు గతంలో ఎప్పుడూ పార్టీకోసం పనిచేయలేదని, వెన్నుపోటు పొడవడమే ఆయన నైజమని విమర్శించారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో సైతం బీఆర్‌ఎస్‌కు ద్రోహం చేశారని, అది గ్రామ ప్రజలు, పార్టీ నాయకులు గ్రహించారన్నారు. అలాంటి వారు తమ స్వార్థం కోసం పార్టీ మారుతున్నారని ఆరోపించారు. కుట్రలు, కుతంత్రాలతో వచ్చే వారికి గుణపాఠం ప్రజలే చెబుతారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో మానుకోట బీఆర్‌ఎస్ అభ్యర్థి బానోత్ శంకర్‌నాయక్‌కు మునిగలవీడు అత్యధిక మెజార్టీ ఇవ్వడం ఖాయమన్నారు. సమావేశంలో ఉపసర్పంచ్ ఇస్సంపల్లి మంగయ్య, కార్యదర్శి గద్దల యాకయ్య, వార్డు సభ్యులు బైస రమేశ్, ఇస్సంపల్లి సుజాత సత్యనారాయణ, కోఆప్షన్ సభ్యుడు కొమ్మనబోయిన ముఖేశ్, ఎస్‌ఎంసీ చైర్మన్ నాగబెల్లి బాలరాజు, యూత్ నాయకులు దుస్స యాకాంతం, బొజ్జ ఉపేందర్, తుప్పతూరి వినోద్ పాల్గొన్నారు.

## ఎస్‌ఈఏఎస్ పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

- మండల నోడల్ ఆఫీసర్ రాందాస్
- పాఠశాలల హెచ్‌ఎంలకు అవగాహన

నెల్లికుదురు, నవంబర్ 2 : స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని మండల నోడల్ ఆఫీసర్ ఏ రాందాస్ అన్నారు. ఎస్‌ఈఏఎస్ పరీక్ష-2023కు ఎంపికైన పాఠశాల హెచ్‌ఎంలకు పరీక్ష నిర్వహణపై మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లోని నైపుణ్యాలను అంచన వేయడానికి రాష్ట్ర విద్యాశాఖ ఈ పరీక్ష నిర్వహిస్తున్నదని, ఈ పరీక్ష ఫలితాల సర్వేతో విద్యార్థులు నైపుణ్యాల్లో ఏస్థాయిలో ఉన్నారో గుర్తించి అందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేస్తారని తెలిపారు. పరీక్షకు మండల వ్యాప్తంగా 19 పాఠశాలలు ఎంపికయ్యాయని, వాటిల్లో నేడు పరీక్ష ఉంటుందని, నిర్వహణకు ఫీల్డ్ ఇన్విస్టిగేటర్లను కేటాయించి, వారికి శిక్షణ ఇచ్చామన్నారు. పరీక్షను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తామని, ఎంపికైన పాఠశాలలు ఫీల్డ్ ఇన్విస్టిగేటర్లకు సహకరించాలని సూచించారు. అనంతరం ఆర్పీ పీ లింగమూర్తి హెచ్‌ఎంలకు పరీక్ష నిర్వహణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నెల్లికుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రవి, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, మండల ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ సుధాకర్, సీఆర్పీలు ఏ భాస్కర్‌రావు, బీ వీరస్వామి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికారి రాందాస్